## జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన ఎంపి



జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖకు పూలబొకేను అందచేస్తున్న ఎంపి బిబి పాటిల్

జహీరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త: ఈ నెల 28వ తారీఖు నుంచి ప్రారంభం కానున్న ప్రజా పాలన కార్యక్రమం అవగాహన కార్యక్రమానికి హాజరైన జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మాత్యులు కొండాసురేఖను జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు మర్యాద పూర్వకంగా కలుసుకుని పూల బొకేను అందచేశారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

## షెడ్యూల్ ప్రకారం ప్రజాపాలన నిర్వహిస్తాం

### -జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వ అదేశాల మేరకు జిల్లాలోని 499 గ్రామ పంచాయతీలు 5 మున్సిపాలిటీలలో గల 114 వార్డులలో షెడ్యూల్ ప్రకారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అన్నారు. బుధవారం అయన మాట్లాడుతూ 28 నుంచి జనవరి 6 వరకు ప్రభుత్వ గ్యారెంటీలైన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలపై ప్రజల నుంచి దరఖాస్తులను ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించడం జరుగుతుందన్నారు. ఎంపిడిఓ, తహశీల్దార్ కార్యాలయాలతో పాటు గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన కార్యక్రమం షెడ్యూల్ ప్రదర్శించాలన్నారు. ప్రతి మండలంలో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులను స్వీకరించడానికి 2 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 2 గ్రామ పంచాయతీలలో కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులను స్వీకిరంచాలన్నారు. దరఖాస్తుతో పాటు పుడ్ సెక్యూరిటీ కార్డు, అధార్ కార్డు జతచేయాలన్నారు. మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాపాల కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి మండలానికి ఒక ప్రత్యేక అధికారితో పాటు నియోజకవర్గాలకు సిద్దిపేట నియోజకవర్గానికి అర్డీఓ రమేష్‌బాబు, హుస్నాబాద్ అర్డీఓ బెనిషాలెం, గజ్వేల్ అర్డీఓ బన్సీలాల్, దుబ్బాకకు డిఅర్‌డిఓ పిడి జయదేవ్ అర్యా, జనగామ నియోజకవర్గ పరిధిలోని మండలాలకు ఎస్సీ కార్పోరేషన్ ఈడీ శ్రీరామ్‌రెడ్డిలను నియమించినట్లు తెలిపారు. ఈ అకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### తైక్వాండోలో మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

సిద్దిపేట రూరల్, డిసెంబర్ 27, ప్రభాతవార్త : వికారాబాద్ జిల్లా తాండూరులో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో ఎస్‌జిఎఫ్ అండర్–14, అండర్–17 బాల బాలికల టోర్నమెంట్‌లో జిల్లా తైక్వాండో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 8 పథకాలు సాధించారు. అండర్–14లో పి.పురందర్ గోల్డ్‌మెడల్, విశాంత్, రోహన్ చంద్ర సిల్వర్ మెడల్స్ సాధించారు. అలాగే అమృత, వినయ్, విజయ్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. అండర్–17లో లోకేష్, చరణ్‌దీప్ సిల్వర్, పురందర్ గోల్డ్‌మెడల్ సాధించారు. గోల్డ్‌మెడల్ సాధించిన పురందర ఈనెల 30 నుంచి జనవరి 5 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో ఎస్‌జిఎఫ్ పోటీలకు ఎంపికైన సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ తైక్వాండో విద్యార్థులను అభినందించారు. జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన పురందర జాతీయస్థాయిలో మెడల్ సాధించి సిద్దిపేటకు మంచి పేరు తేవాలని కలెక్టర్ కోరినట్లు జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచ కొండ శ్రీనివాస్ తెలిపారు.



తైక్వాండో విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

## గ్యారంటీలు ప్రతి కుటుంబానికి అందేలా చూస్తాం

**-ఉద్యోగులకు 1నుండి 5వ తేదీలోపే జీతాలు అందేలా చర్యలు**
**-ప్రజలు ప్రజా పాలనను విజయవంతం చేయాలి**
**-రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్,డిసెంబరు27,ప్రభాతవార్త

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి అందేలా చూస్తామని రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు.బుధవారం రోజున పట్టణంలోని తిరుమల గార్డెలో ఏర్పాటు చేసినపార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మామీలను ప్రజలకు అందేలా కృషి చేస్తుందని,అందులో భాగంగానే నేడు (గురువారం) నుండి జనవరి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రజా పాలనను ప్రజలు విజయవంతం చేయాలన్నారు.ఆరు గ్యారంటీలకు సంబందించిన దరఖాస్తులను ప్రభుత్వమే ప్రజలకు అందిస్తుందన్నారు.ఇక రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీ నుండి 5వ తేదీలోగా జీతాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.రాష్ట్రంలో ఎంత సంక్షోభం వచ్చినా ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వారి ఆస్తులు పెంచుకున్నారన్నారు.కల్వకుంట్ల కుటుంబం ఆస్తులపై సౌద పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా పాలన కార్యక్రమంలో ప్రభుత్వానికి ప్రజలకు వారదులుగా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలని,ప్రభుత్వ ఉద్యోగులు ఈ కార్యక్రమానికి సహకరించి విజయంవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ,కౌన్సిలర్లు భూక్య సరోజన,వల్లపు రాజు,పున్న లావణ్య సది,డిసిసి సభ్యులు కేడం లింగమూర్తి,సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి చిత్తారి రవిందర్,సాఆమాజిక సేవకురాలు కర్ణకంటి మంజూలరెడ్డి,ఆ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు,జంగపల్లి ఐలయ్య,మంద ధర్మయ్యతో పాటు సీనియర్ నాయకులు పెరుమండ్ల నర్సాగౌడ్,మైదంశెట్టి వీరన్న,వెన్న రాజు,బురుగు కిష్టస్వామితో పాటు పాల్గొన్నారు.

## భూములు లాక్కుంటున్నారని రైతుల ఆందోళన



రైతులను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



భూములలో పరిశ్రమ బోర్డును పెడుతున్న దృశ్యం

పటాన్‌చెరు,డిసెంబర్ 27,ప్రభాతవార్త: పటాన్‌చెరు నియోజకవర్గం జిన్నారం మండలం గడ్డ పోతారం గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 27లో తొమ్మిది ఎకరాల అసైన్డ్ భూమి అందుబాటులో ఉంది. ఈ భూముల్లో చాలా కాలంగా రైతులు వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారు. అయితే గత ప్రభుత్వం ఈ భూముల్ని టీఎస్ఐఐసీ కి అప్పగించి నాలుగు పరిశ్రమలకు కేటాయించింది. దీంతో బుధవారం ఉదయం నుంచి పోలీస్ పహారతో భూమిని స్వాధీనం చేసుకొని పనులు మొదలుపెట్టారు. ఈ విషయం తెలిసిన రైతులు, గ్రామస్తులు పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి వెంటనే ఆపాలని ఆందోళన నిర్వహించారు. ఎన్నో ఎండ్లుగా ఈ భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుంటే పరిశ్రమల పేరుతో ప్రభుత్వం తమ భూమిని అక్రమించడం అన్యాయమని రైతులు ఆందోళన చేస్తున్నారు. గతంలో సాగు కోసం ప్రభుత్వం కేటాయించిన భూముల్ని ఇప్పుడు లాక్కోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. మా భూములు మాకే కావాలంటూ రైతులందరూ ఆందోళనకు దిగడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఆందోళనకారులను అడ్డుకొని పోలీస్ పహారాలో పనులు నిర్వహిస్తున్నారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ఇందిరమ్మ రాజ్యాం అంటున్న రేవంత్ ప్రభుత్వం ఇందిరమ్మ కాలనిలో వచ్చిన అసైన్డ్ భూముల స్వాధీనాన్ని ఆపి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు

**-నా దృష్టిలో ఈ ఓటమి చిన్న స్పీడ్ బ్రేకర్**
**-కాంగ్రెస్ వాళ్లు ఎన్నో గ్లోబల్ ప్రచారం, తప్పుడు ప్రచారాలు చేశారు**
**-మాజీ మంత్రి హరీష్‌రావు**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

మెదక్ అర్బన్, డిసెంబర్27 ప్రభాతవార్త: మెదక్ పట్టణంలోని వైస్రాయ్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన మెదక్, హవేళిఘనపూర్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మెదక్‌లో ఓటమి చెందడం దురదృష్టమని, ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎన్నో గ్లోబల్ ప్రచారం తప్పుడు ప్రచారాలు చేశారన్నారు. నా దృష్టిలో ఈ ఓటమి చిన్న స్పీడ్ బ్రేకర్ అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మీకోసం నిలబడతా, ప్రచారం చేస్తా అన్నారు. మిమ్మల్ని కాపాడుకునే బాధ్యత బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. గతంలో ఆరు గంటల కరెంట్ ఇచ్చినప్పుడు మోటార్లు కాలుడు, ట్రాన్స్ ఫార్మర్లు కాలుతుండే అని, ఆ రోజుల్లో ట్రాన్స్‌ఫార్మ కోసం లంచాలు ఇచ్చే పరిస్థితి ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇచ్చామన్నారు. హైదరాబాద్‌కు గోదావరి నీళ్లు తెచ్చామని, సింగూరు నీళ్ల మెదక్ ప్రజలకు అందించింది బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. హల్దీ, మంజీరాల పైన చెక్ డ్యామ్‌లు కట్టామని, కాళేశ్వరం కొండపోచమ్మ సాగర్ లేకపోతే నీళ్ల వచ్చేవి కావని, ఒక గుంట ఎండకుండా పంటలు పండించామన్నారు. ప్రస్తుతం కరెంట్ వస్తుందా, నీళ్ల వదులుతారా అనే అనుమానంలో రైతుల ఉన్నారన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో రైతుబంధు ఇచ్చామన్నారు. రైతుభీమా మంచిది కాదని కాంగ్రెస్ వాళ్లు మాట్లాడుతున్నారని, ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. తెలంగాణ తెచ్చిన బీఆర్ఎస్ పార్టీతో, తెలంగాణతో మనకు పేగుబంధం ఉందని, వందల కేసులకు భయపడకుండా తెలంగాణ కోసం పోరాటం చేశామన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం మేం రాజీనామా చేశాం, కాంగ్రెస్ వాళ్లు చేశారా అని ప్రశ్నించారు. ప్రజలు ప్రశ్నించే రోజు వస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మన సత్తా చూపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలవాలని దుష్ప్రచారం చేసిందని, కార్యకర్తలు గ్రామగ్రామాన దాన్ని తిప్పికొట్టాలన్నారు. ఎక్కడ ప్రజలకు నష్టం వచ్చినా ఆసరాగా నిలబడి అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వాన్ని ప్రశ్నించి ప్రజలకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. తెచ్చిన తెలంగాణ అభివృద్ధిలోకి తీసుకెళ్లింది మనమే అని, కాంగ్రెస్ వాళ్లు గ్లోబల్స్ ప్రచారం చేస్తున్నారని, ఇప్పుడు నమ్మొచ్చు కానీ భవిష్యత్తులో ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, నాయకులు మ్యాడం బాలకృష్ణ, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తొడుపూరి చంద్రపాల్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సిసిఐలో నిలిచిన పత్తి కొనుగోలు

### -రోడ్డెక్కిన అన్నదాతలు



పూసలపాడు రోడ్డుపై నిరసన తెలుపుతున్న పత్తి రైతులు

నాగల్‌గిద్ద, డిసెంబరు 27, ప్రభాతవార్త: మండలంలోని పూసలపాడు చౌరస్తాలో పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. గ్రామంలో కొనసాగుతున్న పత్తి కొనుగోలును సిసిఐ నిలిపేయడంతో అన్నదాతలు ఆగ్రహానికి లోనై రోడ్డెకి నిరసన తెలిపారు. మూడు రోజులగా కొనుగోలు కేంద్రాల వద్ద పత్తితో పడిగాపుల కాస్తున్నా మార్కెటింగ్ అధికారులు పొంతన లేని సమాదానాలు చెబుతూ తమకు ఇబ్బందులకు గురిచేస్తున్నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని రైతుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించడంతో రైతులు తమ నిరసనకు స్వస్తి పలికారు.

## పేదరికం ఉన్నన్ని రోజులు ఎర్రజెండా ఉంటుంది

### -సిపిఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్

అక్కన్నపేట,డిసెంబరు27,ప్రభాతవార్త

దేశంలో పేదరికం ఉన్నన్ని రోజులు సిపిఐ పార్టీ(ఎర్రజెండా) ఉంటుందని ఆ పార్టీ అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అన్నారు.బుధవారం రోజున కమ్యూనిస్టు పార్టీ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అక్కన్నపేట మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వతంత్ర్యం వచ్చిన తర్వాత సిపిఐ పార్టీ అనేక నిర్బంధాలకు గురైందని గుర్తు చేశారు.అన్ని రంగాలలో పని చేస్తున్న కార్మిక వర్గాలకు శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని,పని గంటలు తగ్గించాలని,పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా అనేక కార్మిక,ప్రజా ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ,ఎడల వనేష్,జేరిపోతుల జనార్థన్,మొండయ్య,ఆ పార్టీ గ్రామ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్,నాయకులు ఇంద్రసేనారెడ్డి, రంగయ్య, కొమురయ్య,రాజయ్య,గంగయ్య,సారయ్య,వెంకటయ్య పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మండల కార్యదర్శి భాస్కర్

## రాష్ట్రంలో మార్పును తీసుకువస్తాం

**-ప్రజా పాలన దరఖాస్తు పత్రం ఆవిష్కరణ**
**-అధికారుల సహకారం అవసరం : మంత్రి కొండా సురేఖ**




ప్రజా పాలన అవగాహన సభలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 27, ప్రభాతవార్త: రాష్ట్రంలో మార్పు కొరకు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించారని, మార్పు కోసం అధికారులు ప్రభుత్వానికి సహకరించాల్సి ఉంటుందని ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కలెక్టర్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా పాలనపై అవగాహన సమావేశానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారుల సస్పెండ్లు, కక్ష సాధింపులు ఉండవని, పనితీరు ప్రాతిపదికగా పదోన్నతులు, బదిలీలు ఉంటాయన్నారు. ప్రభుత్వానికి, ఉద్యోగానికి మంచి పేరు వచ్చేలా అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. తాము పాలకులం కాదని, ప్రజా సేవకులమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. కాంగ్రెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు అందరిని భాగస్వాములను చేస్తామన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లను అనర్హులకు ఇచ్చారని ఫిర్యాదు అందాయని పేర్కొన్నారు. రేషన్ కార్డుల లేకుండా డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయించడం సరికాదన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులపై ముఖ్యమంత్రి ఓ నిర్ణయం తీసుకుంటారన్నారు. ఆర్‌టిసి బస్సులు తగ్గించడం జరగదని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని, నిష్పక్షపాతంగా పథకాలను అర్హులకు అందచేస్తామన్నారు. అంతకు ముందు కార్యక్రమానికి చేరుకున్న మంత్రి కొండా సురేఖ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపి, జిల్లా పరిషత్ చైర్మన్లు, ఎంఎల్‌సిలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 28వ తారీఖు నుంచి ఆరంభం కానున్న ప్రజా పాలన గ్రామ సభలో ప్రజలు అందచేసే ధరఖాస్తు పత్రాలను మంత్రి ఆవిష్కరించారు.



ప్రజాపాలన అవగాహన సభలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

## శానిటరీ ఇన్‌స్పెక్టర్ పనితీరుపై సభ్యుల ఆగ్రహం

**-ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పట్టించుకొని కమిషనర్**
**-భూకేటాయింపు వివాద అంశం ఏజెండా నుంచి తొలగింపు**



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి : సిద్దిపేట మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ వనిత పనితీరుపై కౌన్సిల్ సభ్యులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సిద్దిపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్మన్ కడవెర్గు మంజులరాజన్సు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం మాట్లాడుతూ శానిటరీ ఇన్స్‌పెక్టర్ వనిత పేరుకు మాత్రం లీవు పత్రం రాసి పెట్టి తిరిగి వచ్చిన తర్వాత లీవు పత్రాన్ని చించివేసిన రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ గానీ చైర్మన్ గానీ పట్టించుకోవడం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల చేత ఇంట్లో స్వంత పనులు చేయించుకుంటు కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందని శానిటరీ ఇన్స్‌పెక్టర్ పనితీరు మార్చుకోవాలని సభ దృష్టికి తెచ్చారు. డబుల్ బెడ్ రూంలలో టాయిలైట్స్ లీకేజీ మర్మమత్తుల కోసం రూ. 3 కోట్ల పై చిలుకు నిధులు కేటాయించాలని ఏజెండా అంశంలో పొందుపర్చి మున్సిపల్ సర్వసభ్య సమావేశం అమోదం కోసం ప్రవేశపెట్టిన బిల్లుపై సభ్యులు ధర్మవరం బ్రహ్మం, నాయకం లక్ష్మణ్‌లు ఇది ఏమిటని ప్రశ్నించారు. డబుల్ బెడ్ కాం ట్రాక్టర్ ఎవరూ అతని కాల పరిమితి ఎన్ని యేండ్లు ఉంది కాంట్రాక్టర్ కాలపరిమితి ఉందా లేదా తెలియకుండా ..టాయిలెట్ల మర్మమత్తు కోసం రూ.3 కోట్లపై చిలుకు నిధులు కేటాయించాలని ఏజెండాలో చేర్చడం సరికాదని సభ్యులు ప్రశ్నించారు. పట్టణంలోని 1వ వార్డులో భూగర్భ మురికి నీటి కాలువ ట్రంక్ మేయిన్ నిర్మాణంలో 4.10 గుంటల పట్టా భూమి కోల్పోవాల్సి వచ్చిందని అందుకు గానూ బాధితుడు రెట్టింపు భూమిని ఇవ్వలని కోరగా దీనికి విలువగల భూమిని కేటాయించాలని ఏజెండాలో పొందుపర్చగా సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో చేసేదేమిలేక ఏజెండా అంశంలో కౌన్సిల్ అమోదం కోసం పొందుపర్చిన 23వ అంశాన్ని తొలిగించారు. రైతుబజారు, శివాజీనగర్, సుభాష్ రోడ్డు తదితర ప్రాంతాలలో జనాలు ఎక్కువగా సంచరిస్తుండడంతో రోడ్లుకు ఇరువైపుల వాహనాలను నిలుపుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. మున్సిపల్ చైర్మన్ మంజులరాజనర్సు మాట్లాడుతూ శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు ప్రతి రోజు వార్డులలో పర్యటించి పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పారిశుద్ధ్యంలో సిద్దిపేట ఇతరులకు అదర్శంగా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ సంపత్‌కుమార్, కౌన్సిలర్లు, మున్సిల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి అరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకారం

### -గజ్వేల్ ఆర్డిఓ బన్సిలాల్




ఆరు గ్యారంటీల అవగహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ బన్సిలాల్

కొండపాక, డిసెంబర్ 27, ప్రభాతవార్త

అరు గ్యారంటీల అమలు కోసం ఈ నెల 28న దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని గజ్వేల్ ఆర్డీఓ బన్సిలాల్ తెలిపారు. బుధవారం కొండపాక ఐకెపి కార్యాలయంలో నిర్వహించిన అరు గ్యారంటీల అమలు కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న ప్రభుత్వం చేపట్టిన అరు గ్యారంటీల ధరఖాస్తు స్వీకరణ ప్రజా పాలనపై అందరు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగహన కల్పించాలని ఆయన కోరారు. అరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమం సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అధికారులు రెండు టీంలుగా ఏర్పాడి ఉదయం దధ్యాహ్నం ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కౌంటర్లలో ధరఖాస్తులను ఇవ్వని వారు గ్రామ పంచాయతీల్లో సమర్పించవచ్చునని తెలిపారు. అనంతరం మండల ఎంపిటీసిల ఫోరం అధ్యక్షుడు చింతల సాయిబాబా జై కెసిఆర్, జై తెలంగాణ అంటు నినాదాలు చేయడంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో కొండపాక తహసీల్దార్ శ్రీనివాస్, కుకునూరుపల్లి తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపిడిఓ రాంరెడ్డి, కార్యక్రమం ప్రత్యేకాధికారులు అమీనా, నాగేందర్, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎఒ ప్రియదర్శినితో పాటు ఇరు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గీతం జనగణమనను నిత్యం ఆలపించాలి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, డిసెంబరు 27 ప్రభాతవార్త: జనగణమన గీతం గొప్ప దేశభక్తి గీతమని, నిత్యం కోట్లాది మంది అలపించి తమ దేశభక్తిని చాటుతున్నారని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. ప్రజా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంబర్‌పేట నియోజకవర్గంలోని శివానంద్‌నగర్‌లోని నిత్య జనగణమన ప్రారంభమై 600 రోజులు పూర్తి అయిన సందర్భంగా ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఎగరవేసి స్థానిక ప్రజలు, విద్యార్థులతో కలిసి జాతీయ గీతం జనగణమనను ఆలపించారు. దేశభక్తిని పెంపొందించే జాతీయ గీతాన్ని అందరూ ఆలపించాలని విజ్ఞప్తి చేశారు. 600 రోజుల పాటు ఈ గొప్ప కార్యక్రమాన్ని ఎంతో దీక్షతో కొనసాగించిన నిర్వహకుడు ఎం.కె.శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేస్తా

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**


ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న హెచ్‌ఎంటీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నాచారం, డిసెంబర్ 27 ప్రభాతవార్త: ఎన్నికల ముందు ఇచ్చిన హామిలను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొ న్నారు. నాచారం హెచ్ ఎంటీ నగర్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆద్వర్యంలో అసోసి యేషన్ కమ్యూనిటీ హాల్లో ఇటీ వల భారి మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారె డ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే బిఎల్ఆర్‌కు పలు సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి చుట్టు వాకింగ్ ట్రాక్‌ను పూర్తి చేయాలని, పెద్ద చెరువుపై నిర్మించిన ఎస్‌టీపీని తొందరగా ప్రారంభించాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను ఒక్కటిగా పూర్తి చేస్తామని వారికి హామి నిచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.డీ కోటేశ్వర్ రావు, వైస్ ప్రసిడెంట్ జనార్ధన్ రావు, బాబురావు, సతీష్, యాదగిరి రెడ్డి, బుచ్చయ్య, పాండు రంగారావు, కోటేశ్వర్ రావు, కిషన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**ఇన్‌స్పెక్టర్ సీతయ్య**



చిక్కడపల్లి, డిసెంబరు 27 ప్రభాతవార్త: నూతన సంవత్సరం వేడుకలను ప్రజలు, యువత ప్రశాంతంగా జరుపుకోవాలని చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య కోరారు. బుధవారం పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడారు. పోలీసు నిబంధనలు పాటిస్తూ కొత్త సంవత్సరం 2024 వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్‌లకు ఎట్టి పరిస్థిఉల్లో వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. త్రిబుల్ రైడింగ్, అతివేగంగా వాహనాలు నడిపితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు, మాదవ ద్రవ్యాలకు బానిస వాద్దని సూచించారు. యువత చెడు మార్గాల్లో వెళ్ళరాదని సలహా ఇచ్చారు. యువత డ్రగ్స్‌కు బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు.

## అణగారిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పెద్దపీఠ వేస్తుంది

**బిజెఎంసి కాంగ్రెస్ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి**

నార్సింగి, డిసెంబర్ 27 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ అణగారిన వర్గాల అభ్యున్నతికి పెద్దపీఠ వేస్తుందని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అర్హులందరికి అందజేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 28 నుంచి జనవరి ఆరో తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. పదేళ్ల దొరల పాలనలో ఒక్కటంటే ఒక్కటి కూడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా నిరుపేదలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రేషన్ కార్డులతోనే ఇంకా రాష్ట్ర ప్రజలు రేషన్ సరుకులు పొందుతున్నారని, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీయే కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతుందన్నారు. మహాలక్ష్మీ, గృహాజ్యోతి, యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా వంటి గ్యారెంటీలన్నింటిని నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించారన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పతకంను నెవరేర్చామని, మహిళలంతా ఆనందంగా ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారన్నారు. త్వర లోనే రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పతకాలు అమలు అవుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్పోరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కృష్ణారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతుంది

**తెలంగాణ ఐటి, పరిశ్రమలశాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**


మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆహ్వానపత్రం అందిస్తున్న బ్రహ్మణ అసోసియేషన్ నాయకులు

ముషీరాబాద్, డిసెంబర్ 27, ప్రభాతవార్త: ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణుల అభివృద్ధికై తెలంగాణ ప్రభుత్వం పాటుపడుతుందని తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ బ్రాహ్మణ ఆఫీషల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వింజమూరి సుధాకర్, కన్వీనర్ పి.వి.రాంచందర్‌రావు మంత్రిని కలసి ఈనెల 30వ తేదీ తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సుకు ముఖ్యఅతిధిగా హాజరవ్వాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణుల ఐక్యతకు, పూర్వ వైభవం కోసం నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ, కమర్షియల్ టాక్స్ కమీషనర్ డాక్టర్ టి.కే.శ్రీదేవి, సచితానంద సరస్వతి స్వామిలు హాజరై ప్రసంగి స్తారని తెలిపారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బ్రాహ్మణ ఐక్యతకు, పూర్వవైభవం కోసం చేసే కృషిలో తాను భాగస్వామిని అవుతానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్య క్షులు పి.వెం కటరమణ, అదనపు ప్రధాన కార్యదర్శి పి.సీతారామయ్య, సభ్యులు ఎస్.భానుశర్మ, భరత్‌కుమార్, వేదాంతం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కంటోన్మెంట్, డిసెంబర్ 27 ప్రభాతవార్తః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయహస్తం, గ్యారెంటీలకు సంబధించిన దరఖాస్తుల స్వీకరణ నిర్వహించనున్న ప్రజాపాలన కార్యాక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత, ప్రజాపాలన స్పెషల్ ఆఫీసర్ శకుంతల, ఇంచార్జిలు ఆర్‌డీఓ రవికుమార్‌తో కలిసి ప్రజాపాలన దరఖాస్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఈనెల 28 నుంచి వచ్చేనెల 6వ తేదీవరకు కంటోన్మెంట్‌లోని అన్ని వార్డుల పరిధిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. డిసెంబర్ 31, జనవరి 1న మాత్రం సెలవు ఉంటుందని తెలిపారు. వార్డుల వారీగా ప్రతిరోజు నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. అనంతరం ఆర్‌డీఓ రవికుమార్ మాట్లాడుతూ అభయ హస్తం కింద ప్రభుత్వం అందజేసే పథకాలకు అన్నింటికి ఒకే దరఖాస్తు ఉంటుందన్నారు. ఈ కార్యాక్రమంలో కంటోన్మెంట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ జీవీ వెన్నెల గద్దర్, తహసీల్దారలు పద్మసుందరి, అశోక్, బోర్డు అధికారులు అఫ్జల్, అక్బర్‌అలీ, దేవేందర్, మహేందర్, గోపాలకృష్ణ, బాలకృష్ణ, ఉమాశంకర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పంబరట్టు పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 27, ప్రభాత వార్త: పోచారం గ్రామంలోని శ్రీ సర్వమంగళ సమేత స్పటిక లింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం శ్రీ అయ్యప్ప స్వామి మహాపడిపూజోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని శ్రీ అయ్యప్ప స్వామి మహాపడిపూజోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులు తెలంగాణ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి మలాధారణ ధరించిన భక్తులు స్వామివారికి నిత్యపూజలు చేయడం వారి భక్తికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్వామివారికి పంబారట్టు పూజలు నిర్వహించారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


సమావేశంలో పాల్గొన్న చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ముజీబుల్లా షరీఫ్,నాయకులు

చార్మినార్, డిసెంబరు 27 ప్రభాతవార్త : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ముజీబుల్లా షరీఫ్ అన్నారు. పాతబస్తీ మూసాబౌలిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు జరగనున్న ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలు ఆరు గ్యారంటీలకు సంబంధించిన ధరఖాస్తులను అంద చేయాలని, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు హైదర్ జాఫ్రీ, మీర్జా అస్గర్ అలీ, అస్లాం షరీఫ్, మహ్మద్ థానీష్, దినేష్ బిడ్లా, దీపక్ బిడ్లా, మహ్మద్ సలీం, మహ్మద్ జుబేర్‌లు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ రాజేష్ కుమార్

చార్మినార్, డిసెంబరు 27 ప్రభాతవార్త : పాతబస్తీ ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అన్ని విధాల సద్వినియోగం చేసుకోవాలని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. బహదూర్‌పుర నియోజకవర్గం పరిధిలోని దూద్‌బౌలిలో బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గా ్యరంటీలను కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల ఆరవ తేదీ వరకు నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో ప్రజలు నుంచి ప్రజా పాలన ధరఖాస్తులను స్వీకరించటం జరుగుతుందని తెలిపారు. పాతబస్తీ ప్రజలు ఆరు గ్యారంటీలకు సంబంధించిన ధరఖాస్తులను ప్రజా పాలన కార్యక్రమంలో అధికారులకు అంద చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్, సయ్యద్‌ఇక్బాల్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాగంటి

సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త : వెంగళ్ రావు డివిజన్ మధురానగర్ కమిటీ హాల్‌లో బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు, బిఆర్‌ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజవకర్గ ప్రజలు అందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్యరావు, మధురనగర్ కమిటీ సభ్యులు సత్యనారాయణ, రాజు, కళ్యాణ్, చక్రవర్తి, రాజన్, సుగుణ, విశ్వప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## 30న తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ జాతీయ లోకదాలత్ నిర్వహణ

సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త : తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ జాతీయ లోకదాలత్‌ను ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్సార్‌నగర్ ఇన్స్‌పెక్టర్ పి.వి. రామ్ ప్రసాద్ రావు తెలియజేశారు. సెటిల్‌మెంట్ కోసం రాష్ట్రంలోని డిఫరెంట్ కోర్టుల నుండి పైకి టేకప్ కేసులు, క్రిమినల్ కేసులు, సమ్మిళితమైన చిన్న కేసులు వున్నందునవలన, న్యాయ సేవాధికార సంస్థ, స్థానిక పోలీసులు ఫిర్యాదుదారులు, ప్రతివాదులను గౌరవప్రదమైన న్యాయమూర్తికి ముందు జరిగిన వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం కోసం అభ్యర్థించారు. మీకు సహాయం చేయడానికి, సూచనలు అందించడానికి స్థానిక ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వారిని సంప్రదించాలని తెలిపారు. ఏదైనా సమాచారం కోసం దిగువ పేర్కొన్న నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

**ఎస్సార్ నగర్ ఇన్స్‌పెక్టర్ పి.వి.రామ్ ప్రసాద్ రావు - పిఎస్,**

**ఎస్ఆర్ : 8712661276**

**స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సిఐ) : 8712660499**

**అడిషనల్ ఇన్స్‌పెక్టర్ (డిఐ) : 8712661069**

**అడ్మిన్ ఎస్ఐ : 8712661076**

## పౌర సరఫరాలశాఖ కమిషనర్‌ను కలిసిన నాన్‌గజిటెడ్ ఉద్యోగులు



అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 27ప్రభాతవార్త:తెలంగాణ ఫౌర సరఫరాలశాఖ కమీషనర్‌గా పదవి భాద్యతలు చేపట్టిన దేవేంద్రసింగ్ చౌహాన్‌ను తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ మర్యాద పూర్వకంగా కలిశారు. డిఎస్‌చౌహాన్‌కు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ, కార్యదర్శి విక్రమ్‌కుమార్, కార్యవర్గసభ్యులు బొల్లిగిద్దశంకర్‌లు కలిసి బోకె అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్ధవంతంగా, భాద్యత యుతంగా పని చేసుందని ఆకాంక్షించారు. పౌరసరఫరాలశాఖ ఉద్యోగులు సంస్థ కోసం కష్టపడి పనిచేయాలని కోరినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు.

## మహాపడి పూజల్లో పాల్గొన్న అయ్యప్పస్వాములు

అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 27ప్రభాతవార్త: నేతాజీ నగర్ కాలనీలో అయ్యప్ప స్వామి మహాపడి సుఖేష్‌స్వామి ఆద్వర్యంలో మహా వైభవంగా కొనసాగింది. అయ్యప్పస్వామి మహాపడి పూజను కాశీ విశ్వనాథ్ సన్నిదానం దాసరి రాజ్‌కుమార్ గురుస్వామి, ఎం.వినోద్‌కుమార్‌గురుస్వామి, కిరణ్‌గురుస్వామి, రమేష్‌గురుస్వామి నిర్వహించారు. అయ్యప్పస్వామిభక్తి గీతాలను ఆలపించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో కాలని అధ్యక్షులు లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి జయబాబుస్వామి, చైర్మన్ గోవర్ధన్ సాంబశివరావు, సుఖేష్‌స్వామి పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

**ఆదం సంతోష్ కుమార్**



అడ్డగుట్ట, డిసెంబర్ 27 ప్రభాతవార్తః కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారెంటీలను అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యాదర్శి, సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ సూచించారు. బుదవారం తుకారంగేట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు సిద్దంగా ఉందన్నారు. అందుకోసం అభయ హస్తం పేరుతో ప్రజా పాలన అందించేందుకు కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల తిరగకముందే ఇచ్చిన హామీలను అమలుపరిచేందుకు కృషి చేస్తుందన్నారు. గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు ఈ గ్యారెంటీల కోసం రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకునే వీలు కల్పిస్తుందన్నారు. అర్హులైన వారందరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఈ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యాకర్తలు ఉందన్నారు. తెలియని ఆరికి వివరించి దరఖాస్తు చేసుకునేందుకు సహాయపడాలన్నారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్‌లలో డివిజన్‌కు 4 సెంటర్‌లను ఏర్పాటు చేశారని, సెంటర్‌కు ఒక అధికారిని నియమించినట్లు చెప్పారు.

## అర్హులంతా ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోండి

**బండ్లగూడ కార్పోరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్**



బండ్లగూడ కార్పోరేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

నార్సింగి, డిసెంబర్ 27 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని అర్హులైన ప్రజలంతా "ఆరు గ్యారెంటీల" కోసం దరఖాస్తు చేసుకోవాలని మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కార్పోరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమీషనర్ సతీష్ చంద్ర, ఇతర అన్ని శాఖల అధికారులతో కలిసి మేయర్ ప్రజా పాలన కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 28.వ,తేదీ నుంచి జనవరి 6.వ,తేదీ వరకు ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని, అర్హులైన ప్రజలంతా తమ తెల్ల రేషన్ కార్డులు, ఆధార్ కార్డులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డులు లేని వారు సైతం దరఖాస్తు చేసుకునే వెసలుబాటు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## అయోధ్య రాముని పూజిత అక్షింతల ఊరెగింపు

పెద్దేముల్, డిసెంబరు 27, ప్రభాతవార్త: పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో బుదవారం అయోధ్య రాముని పూజిత అక్షింతల ఊరెగింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం మీదుగా రామాలయా దేవాలయం వరకు శ్రీరాముని చిత్రపటంతో పాటు పూజిత అక్షింతలను పల్లకిలో ఊరెగింపుగా తీసుకెళ్ళారు. శ్రీరామ రామ జయరామ రామ అంటు నినాదాలు చేస్తు భజన సంకీర్తనలతో పల్లకి సేవా కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. పూజిత అక్షింతలను శ్రీరామాలయంలో భద్రపరిచారు. ఐదు రోజుల పాటు భజనలు, శ్రీరామనామ సంకీర్తనల తరువాత గ్రామంలోని ప్రతి ఇంటికి పూజిత అక్షింతలను వితరణ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

## 5241 కేసుల్లో శిక్షలు ఖరారు

**రాచకొండ కమిషనరేట్ పరిధిలో పెరిగిన నేరాలు**

**వార్షిక నివేదిక సమర్పించిన రాచకొండ సిపి సుధీర్‌బాబు**



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

ఎల్‌బినగర్, డిసెంబర్ 27 ప్రభాతవార్త: రాచకొండ కమిషనరేట్ పరిధిలో నేరాల శాతం పెరిగిందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో వార్షిక నేర నివేదికను బుధవారం నాగోల్ దేవకి కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంతో పోలిస్తే 2023లో 6.86 శాతం నేరాలు పెరిగాయన్నారు. 2023 సంవత్సరంలో 27,586 సైబర్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాచకొండ పరిధిలో సైబర్ నేరాలు 25 శాతం పెరిగినట్లు వెల్లడించారు. మానవ అక్రమ రవాణా కేసులకు సంబంధించి 58 కేసులు నమోదు అయ్యాయని అందులో 163 మంది నిందితులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. వివిధ రకాల బెట్టింగులు గేమింగ్‌లకు సంబంధించిన యాక్ట్ క్రింద 108 కేసులు నమోదు చేశామని అందులో 972 మంది నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. ఇక మహిళలపై 6.65 శాతం నేరాలు తగ్గాయన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా మారక ద్రవ్యాలకు సంబంధించి పెద్ద ఎత్తున కేసులు నమోదు కాగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాలకు సంబంధించి 282 కేసులు నమోదయ్యా అన్నారు. మాదక ద్రవ్యాల కేసులో 698 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. మాదక ద్రవ్యాల కేసులో 12 మందిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేశామన్నారు. 2023 సంవత్సరంలో జరిగిన వివిధ నేరాలకు సంబంధించి 5,241 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారు అన్నారు. 62 శాతం కన్విక్షన్ రేటు పెరిగిందని తెలిపారు. రాచకొండ పరిధిలో 20 కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు కూడా విధించడం జరిగిందని తెలిపారు.

**దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమిషనరేట్**

దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమిషనరేట్ రాచకొండ పోలీస్ కమిషనరేట్ రాచకొండ కమిషనరేట్ పరిధిని అర్బన్, సెమి అర్బన్, రూరల్ అని 3 ప్రాంతాలుగా విభజించి పర్యవేక్షిస్తున్నామని అన్నారు. పేకాట, దింగతనాలు, చైన్ స్నాచింగ్, ఆటోమొబైల్, ఇండ్లలో దింగతనం, హత్యలు, కిడ్నాపింగ్, రేప్, గృహహింస లాంటి అన్ని కేసుల్లో గత సంవత్సరం 25,815 కేసులు కాగా ఈ సంవత్సరం 27,586 కేసులు 6.86 శాతం పెరిగాయన్నారు. 2022లో సైబర్ క్రైమ్ నేరాలు 2049 కాగా, 2023 నాటికి 2562 అంటే 25 శాతం పెరిగాయన్నారు. కమిషనరేట్ పరిధిలో 36,126 కేసులు నమోదు కాగా 75శాతం పరిష్కరించబడ్డాయని 61శాతం కేసుల్లో శిక్షలు ఖరారు అయ్యాయని టెక్నాలజీ కమ్యూనికేషన్ సహకారంతో కేసులు పరిష్కారం సులభం అవుతుందని చైన్ స్నాచింగ్, అత్యాచారం, సాధారణ దొపిడీ కేసులు గత ఏడాది కంటే ఇప్పుడు తగ్గాయి అని అన్నారు. గత ఏడాది కేసులలో లెక్కించబడన డబ్బు, జూదం ఆక్ట్, ఎలక్షన్ సంబంధించిన కిట్లు, లక్కీడ్రా, చైన్‌స్నాచింగ్ ఇతర కేసులకి కలిపి రూ.9,16,25,73 నగదు పట్టుకున్నారు. ట్రాఫిక్ సంబంధించిన కేసుల్లో ఓవర్ స్పీడ్, సెల్ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్, వితౌట్ హెల్మెట్, ఇర్రెగ్యులర్ నెంబర్ ప్లేట్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, నోఎంట్రీ, వితౌట్ డ్రైవింగ్ లైసెన్స్, సీట్ బెల్ట్, డ్రంక్అండ్‌డ్రైవ్ కేసులలో గత సంవత్సరం కంటే 47.61శాతంపెరిగాయి అని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బి.సాయిశ్రీ, డీసీపీలు, ఏడిసిపిలు, ఏసిపి ట్రాఫిక్, డిసిపి, సిఐలు, డిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## 29న కలెక్టరేట్‌లో ఉపాధి కల్పన

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 27, ప్రభాతవార్త : ఈ నెల 29వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం (ఎంప్లాయిమెంట్ ఆఫీస్)లో నిరుద్యోగ యువతీ, యువకుల కోసం జాబ్ మేళా జరుగుతుందని ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.వై.నిర్మల పేర్కొన్నారు. 29న శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్ మేళా కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించటం జరుగుతుందన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన యువతీ, యువకులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె సూచించారు. ట్రెడ్జ్ ఐటి హైదరాబాద్ కంపెనీలో బిజినెస్ డవలప్‌మెంట్ ఎక్జిక్యూటీవ్ 30పోస్టులకు డిగ్రీ, ఎంబిఎ ఉన్న వారికి 16నుంచి 18వేల రూపాయల వరకు వేతనం ఉంటుందని ఆసక్తి ఉన్న వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. అదే కంపెనీలో కస్టమర్ సపోర్ట్ ఎక్జిక్యూటీవ్ పోస్టులు 60 ఉన్నట్లు వీటికి ఇంటర్ లేదా డిగ్రీ అర్హత ఉండాలన్నారు. 12వేల నుంచి 18వేల రూపాయల వరకు వేతనం ఉంటుందన్నారు. అదే కంపెనీలో టెల్ మార్కెటింగ్ ఎక్జిక్యూటీవ్ 50పోస్టులకు డిగ్రీ, ఎంబిఎ ఉన్న వారు అర్హులని 15వేల నుంచి 18వేల రూపాయల వరకు వేతనం ఉంటుందని అన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌సిఎస్.జిఒవి.ఇన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని హాజరు కావాలని హెచ్‌ఆర్ ప్రతినిధులచే ఇంటర్వ్యూలు జరుగనున్నట్లు ఆమె వివరించారు.

## ప్రజాపరిపాలన ప్రజల్లోకి తీసుకెళ్దాం

### -కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 27, ప్రభాతవార్త :** ప్రజా పరిపాలనను ప్రజలకు అందించేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉంటూ అవగాహన కల్పించాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. బుధవారం అయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గం పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ సూచనల మేరకు ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజాపాలనాలో భాగస్వామ్యం కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పరిపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి దరఖాస్తు నింపి అధికారులకు అందజేద్దామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మజార్ మాలిక్, గయాజుద్దీన్, రశాద్, నజ్జు, అయుబ్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటం చేసే ఏకైక పార్టీ సీపీఐ



పార్టీ జెండాను అవిష్కరిస్తున్న చాడ వెంకటరెడ్డి

**బెజ్జంకి, డిసెంబర్ 27, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తూ ప్రజలకు అండగా నిలిచే ఎకైక పార్టీ సీపీఐ అని అ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం సీపీఐ 99వ అవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను అవిష్కరించారు. అనంతరం అయన మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి అనే నినాదంతో ఎంతో మంది నిరుపేదలకు భూ పంపిణీ చేసిన ఘనత సీపీఐ పార్టీదన్నారు. కాగా మండల కేంద్రంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు నిమ్మ దుర్గారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ, ఏఐవైఎఫ్ నాయకులు మర్రి వెంకటస్వామి,పోతిరెడ్డి వెంకటరెడ్డి కోహెడ సృజన్‌కుమార్, వెంకటరెడ్డి, గడిపె మల్లేష్, బోనగిరి మహేందర్, నిషాని శివకృష్ణ, సంఘం మధు, దొంతరవేణి మహేష్, బోనగిరి శ్రావణ్, రాకేష్, లక్ష్మణ్, అలీసాబ్, బోనగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రఘునందన్ రావుపై విమర్శలు చేయ్యడం సరికాదు

### -ఆ పదవి దళితులకే తప్ప మరొక్కరి ఇవ్వరు
### - దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మరాటి బాబు



సమావేశంలో మాట్లాడుతున్న భాజపా నాయకులు

**దుబ్బాక, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** న్యాయబద్దంగా మాట్లాడే వ్యక్తి కాబట్టె న్యాయబద్దంగా గవర్నర్‌కి ప్రొడ్యూస్ చేశాడని గగ్గోలు ఉందుకు పెడుతుంద్రు, ఎస్సి కమిషనర్ ఛైర్మన్ పదివి దళితుకే తప్ప మరొక్కరి ఇవ్వరు అనే ఆలోచన బిఆర్ఎస్ నాయకులకు లేదని బిజెపి దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మరాటి బాబు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రఘునంధన్ రావుని విమర్శిస్తే సరికాదని, ఆయన ఎమ్మెల్యేగా పదవిలో ఉన్నంత కాలం దళిలకు అధిక ప్రాధాన్యతి ఇచ్చారన్నారు. రఘునంధన్ రావుపై బురద చల్లె ప్రయత్నం బిఆర్ఎస్ నాయకులు చేస్తున్నారన్నారు. నిజనిజాలు తెలుసుకుని బిఆర్ఎస్ నాయకులు మాట్లాడడం మంచిదన్నారు. పదవిలో ఉండి ఎన్నికల ప్రచారంలో ఏలా పాల్గొంటాడని, ఆధారాలతో సహా మా వద్ద ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బెల్ల సంజీవులు, సీనియర్ నాయకులు కనకరాజు, బుగ్గరాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల నిర్లక్ష్యం వల్ల వాహనదారుడు మృతి

**ములుగు, డిసెంబర్ 27 (ప్రభాతవార్త):** ఓ రైతు నిర్లక్ష్యంగా రోడ్డుపై వరిధాన్యం కుప్ప, ధాన్యం సంచులను నిర్లక్ష్యంగా ఉంచడంతో ఒక నిండు ప్రాణం పోయిన సంఘటన క్షీరసాగర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 12వ తేదీ మామిడ్యాల గ్రామానికి చెందిన నీరుడి ఉప్పలయ్య(46) తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మర్కుక్ మండలం భవానందపూర్ గ్రామానికి వెళ్ళి తిరిగి రాత్రి 7.30 గంటల సమయంలో క్షీరసాగర్ మీదుగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మామిడ్యాల గ్రామానికి వస్తున్నాడు. క్షీరసాగర్ గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన ఓ రైతు వరి ధాన్యం, ధాన్యం సంచులను రోడ్డుపై నిర్లక్ష్యంగా పెట్టడంతో అవి గమనించని ఉప్పలయ్య ధాన్యం సంచులను ఢీకొట్టి కింద పడ్డాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు తీవ్ర గాయాలకు గురైన ఉప్పలయ్యను లక్ష్మక్కపల్లిలోని ఆర్‌విఎం ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స అవసరమని తెలుపడంతో హైద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 3.30 గంటలకు మృతిచెందగా మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు ధాన్యంను కల్లాలలో ఆరబెట్టుకోవాలని, రోడ్లపై పోయడం వల్ల అమాయక ప్రజలు బలి అవుతున్నారని తెలిపారు. ఎవరైనా రోడ్లపై ధాన్యం పోసినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



శవ పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పుష్పలతకిషన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లతానరేందర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి హరికృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌసల్యాదేవి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపిపి లావణ్య అంజన్‌గౌడ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

# ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**దుబ్బాక మండలంలో..**

**దుబ్బాక, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనపై అధికారులకు, ప్రజాప్రతినిధిలకు బుధవారం దుబ్బాక మండల కేంద్రంలో ఐటిసి కార్యాలయంలో ఎంపిపి కొత్త పుష్పలతకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో డిఆర్‌డిఓ డిపిడి బాల్‌రాజ్, దుబ్బాక తహాశీల్దార్ వెంకట్‌రెడ్డి, అక్బర్‌పేటభూంపల్లి జయంత్, ఎంపిడిఓ భాస్కర శర్మలు అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి పుష్పలత మాట్లాడుతూ నేటి నుండి గ్రామాల్లో ప్రజాపాలనపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రామాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజాపాలన కేంద్రాలో ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**తొగుట మండలంలో..**

**తొగుట, డిసెంబర్ 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని ఎంపిపి లతానరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలో ఈనెల 28 నుంచి నిర్వహించ తలపెట్టిన ప్రజాపాలనపై అధికారులు, ప్రజాప్రతినిధులతో బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పభుత్వ అదేశాల మేరకు మండలంలో రెండు టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి వంద మందికో కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిఆర్‌డిఓ పిడి జయదేవ్ అర్యా తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పాగాల కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కం స్వామి, రేపాక తిరుపతి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేట నియోజకవర్గంలో..**

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 27, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం ఏ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులైన నిరుపేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం అయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలనలో అర్హులైన పేదలకు ప్రభుత్వం అమలు చేసే పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీల లోని వార్డులో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గంప మహేందర్‌రావు, జీవన్‌రెడ్డి, నాయిని నర్సింహ్మారెడ్డి, కలీం, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి,చందుభాయ్, వాహబ్, అజ్మత్, మున్నా,సీతబాలు,శంకర్ ప్రతాప్,వంశీ,పవన్ పాల్గొన్నారు.

**మర్కుక్‌మండలంలో...**

**మర్కుక్, డిసెంబర్ 27 (ప్రభాతవార్త):** ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి కౌసల్యాదేవి అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, తహాసీల్దార్ చంద్రశేఖర్‌రావు, ఎంపిడిఓ ప్రవీణ్, ఎస్ఐ శంకర్, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్ పట్టణంలో..**

**హుస్నాబాద్,డిసెంబరు27,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు గాను చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ఈనెల 28నుండి జనవరి 6వరకు హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించనున్నట్లు హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ వెల్లడించారు. ఈ నేపధ్యంలో ఈ కార్యక్రమానికి రెండురోజులు సెలవులు ఉంటాయని అందులో డిసెంబర్ 31 మరియు జనవరి 1న సెలవులని పేర్కొంటూ ఈ రెండు రోజులను మినహాయిస్తే మిగతా అన్ని రోజులు పనిదినాలుగా పరిగణించాలని రాజశేఖర్ ప్రజలకు సూచించారు.ఇందుకు సంబంధించిన ప్రజలకు ఒకే చోట ఇక్కట్టకు గురి కాకుండా ఉండేందుకు పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా ప్రదేశాలకు వార్డు అధికారులను నియమించినట్లు వివరించారు.ఇందులో పట్టణంలోని మొదటివార్డు నుండి పంవవార్డు వరకు మొదటివార్డు ఎస్‌సికమ్యూనిటీ హాలు,రెండవవార్డు బస్తీదవాఖానా,మూడవవార్డు మూసివేలకు గురైన విద్యావాణి ఉన్నతపాఠశాల,నాలుగవవార్డు వెంకటేశ్వర గార్డెన్,ఐదవవార్డు పురాతన తహసీల్ కార్యాలయం,ఆరవవార్డు శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం, ఏడవ వార్డు మున్సిపల్ దుకాణాల సముదాయము, ఎనిమిదవ వార్డు యాదవసంఘం భవనం,తొమ్మిదవవార్డు మహిళా సంఘభవనం,పదవవార్డుమండల పరిషత్ సమావేశ మందిరం,పదకొండవవార్డు నీటిపారుదలశాఖ భవనం, పన్నెండవ వార్డుముదిరాజ్ సంఘభవనం, పదమూడవవార్డు వ్యవసాయశాఖ కార్యాలయం,పధ్నాలుగవవార్డు సిద్దార్థ ఉన్నత పాఠశాల భవనం,పదిహేనవవార్డు శ్రీనివాస రైస్‌మిల్లు ,పదిహారో వార్డు అపోలో వొకేషనల్ జూనియర్ కళాశాల భవనం,పదిహేడవవార్డు శివాలయం సమీపంలో,పద్దెనిమిదవ వార్డు బుడిగ.ంగాల కమ్యూనిటీ హాలు,పందొమ్మిదవవార్డు విశ్రాంత ఉద్యోగుల భవనం,ఇరవైవార్డులో రైతుబజార్ (బురుజు సమీపంలో)నిర్వహించనున్నట్లు రాజశేఖర్ వెల్లడించారు.పట్టణంలోని ప్రజలు తమ సమస్యలు వినతిపత్రాలను ప్రభుత్వం ప్రవేశపెడుతన్న ఆరు గ్యారంటీ స్కీంలకు సంబందించిన దరఖాస్తులను తమ వార్డులోని వార్డు అధికారులకు అందచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.అలాగే హుస్నాబాద్ మండలంలోని మడథ,రాములపల్లి, పోతారం (ఎస్),జిల్లలగడ్డ గ్రామాలలో 28వతేదీన,89న మహ్మదాపూర్,ఉమ్మాపూర్,మీర్జాపూర్ బల్లునాయక్‌తండా,30న నాగారం,వంగరామయ్యపల్లి,గాంధీనగర్,తోటపల్లి,2వ తేదీన కూచనపల్లి,బంజేరుపల్లి,వందిల్ల,పొట్లపల్లి,మాలపల్లి గ్రామాలలో ప్రజాపాలన నిర్వహించనున్నట్లు హుస్నాబాద్ తహశీల్దార్ రవిందర్‌రెడ్డి తెలిపారు.ఇక అక్కన్నపేట మండలంలోని 28 (నేడు)అక్కన్నపేట, గొల్లకుంట, కేశనాయక్ తండా,పంతుల్‌తండా,29న అక్కన్నపేట, గుబ్బడి, జనగామ,చౌటపల్లి,30న గొల్లపల్లి,మల్లంపల్లి, మోత్కులపల్లి, పెద్ద తండా,2వ తేదీన కట్కూర్,దుబ్బతండా, చాపగానితండా, గుడాటిపల్లి,3న మంచినీళ్లబండ, కేశవాపూర్, గోవర్ధనగిరి ,బొడిగపల్లి,4ననందారం,మసిరెడ్డి తండా,కేశనాయక్ తండా,ధర్మారం,5న మైసమ్మవాగుతండా, కుందన వాని పల్లి, రేగొండ,మలిచేరువుతండా,6న గౌరవెల్లి, గుడాటిపల్లి ,రామవరం,పోతారం(జె) గ్రామాలలో ప్రజాపాలన నిర్వహించడం జరుగుతుందని అక్కన్నపేట సత్యపాల్‌రెడ్డిలు తెలిపారు.

**ములుగు మండలంలో..**

**ములుగు, డిసెంబర్ 27 (ప్రభాతవార్త):** ప్రజా పాలనను ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపిపి లావణ్య అంజన్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజా పాలన అభయ హస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణపై బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎంపిపి లావణ్య అంజన్‌గౌడ్ స్థానిక ఎస్ఐ విజయ్‌కుమార్, తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపిడిఓ వెంకటేశ్వర్‌రెడ్డిలతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సలీం, వైస్ ఎంపిపి దేవేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

**జగదేవ్‌పూర్ మండలంలో..**

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 27 (ప్రభాతవార్త):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మెరుగు బాలేషం గౌడ్ అధ్యక్షతన ఎంపిడిఓ శ్రీనివాస్‌వర్మ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు అందించడానికి నేటి నుండి జనవరి 6 వరకు గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సుధాకర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, జగదేవ్‌పూర్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్ఐ చంద్రమోహన్, మండల కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఎక్బాల్, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, ఎంపిటిసిలు మహేందర్‌రెడ్డి, మహేష్, కవిత శ్రీనివాస్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు భానుప్రకాష్‌రావు, కొత్త లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరి రవి, మంజుల రమేష్, మండల వ్యవసాయాధికారి వసంతరావు, పిఆర్ ఏఈ దేవయ్య, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**వర్గల్ మండలంలో..**

**వర్గల్, డిసెంబర్ 27 (ప్రభాతవార్త):** ప్రజల మేలు కోసమే ప్రజా పాలన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని వర్గల్ మండల ఎంపిపి లతా రమేష్‌గౌడ్, జెడ్‌పిటిసి బాల మల్లుయాదవ్‌లు తెలిపారు. బుధవారం వర్గల్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిడిఓ మేరీ స్వర్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపిపి, జెడ్‌పిటిసిలు మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం ఈనెల 28 నుండి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో కొత్త రేషన్‌కార్డు, రైతు భరోసా, మహాలక్ష్మి తదితర ఆరు గ్యారంటీ పథకాలను అమలు కోసం దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సిఐ జానకి రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అమెరికా తెలుగు అసోసియేషన్ సేవలు అభినందనీయం

## -ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



ఉచిత వైద్య శిబిరంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జయంత్‌రెడ్డి

**గజ్వేల్, డిసెంబర్ 27 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలో గతంలో కనీ వినీ ఎరుగని రీతిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పెద్దఎత్తున నిర్వహించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించగా సుమారు 2వేల మందికి ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో గజ్వేల్ పట్టణానికి చెందిన పలు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు పాల్గొనగా వైద్యం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని అన్నారు. అనంతరం అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్‌రెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని, నిరుపేదలకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలకు ఎలాంటి సేవ అందించడానికైనా తమ సభ్యులు ముందంజలో ఉంటారన్నారు. సేవా కార్యక్రమం చేయడం గొప్ప కాదని, లయన్స్ క్లబ్ నిర్వాహకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారం అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, గజ్వేల్ జెడ్‌పిటిసి పంగ మల్లేశం, స్థానిక కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, అమెరికా తెలుగు సంఘం సభ్యులు భీంరెడ్డి, సతీష్‌రెడ్డి, రాంరెడ్డి, ఐఎంఏ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ లింగం, లయన్స్ క్లబ్ డిస్టిక్ వైస్ గవర్నర్ అమర్నాథ్‌రావు, డాక్టర్ కాశినాథ్, సీనియర్ వైద్యులు డాక్టర్ పెంటాచారి, కార్యదర్శి మహిపాల్, డాక్టర్ సుజాత, డాక్టర్ పద్మజ్యోతి, డాక్టర్ నరేష్‌బాబు, లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ, కార్యదర్శి సంజయ్‌గుప్త, లయన్ పరమేశ్వర్‌చారి, ల్యాబ్ రమేష్, నంగునూరి సత్యనారాయణ, డాక్టర్ మెరుగు శ్రీనివాస్, డాక్టర్ మెరుగు సత్య నారాయణ, లయన్ గోలి సంతోష్, లయన్ విజయభాస్కర్, ఎన్‌సి.సంతోష్, సత్తయ్య, వెంకటేశ్వర్లు, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు రాజారాం, కటుకం శ్రీనివాస్, శ్రీగిరిపల్లి చిమ్మిరెడ్డి, మెడికల్ షాప్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ బిల్లు కట్టలేదని ఎమ్మార్వో కార్యాలయానికి సరఫరా నిలిపివేసిన విద్యుత్ అధికారులు




తహసీల్దార్ కార్యాలయం

**పటాన్‌చెరు, డిసెంబర్ 27,ప్రభాతవార్త:** జిన్నారం మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో సుమారు ఐదు సంవత్సరాలుగా కరెంట్ బిల్లులు కట్టడం లేదు. అనేకసార్లు అధికారులకు కరెంటు బిల్లు కట్టాలని విద్యుత్ శాక అధికారులు విన్నవించుకున్న రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో తహసీల్దార్ కార్యాలయ విద్యుత్తు కనేక్షన్ తొలగించారు అధికారులు. గత ఐదెండ్లుగా పెండింగ్ లో ఉన్న రూ.9.30లక్షల బిల్లులు చెల్లిస్తేనే కరెంట్ కనెక్షన్ పునరుద్దరిస్తామని తేల్చి చెప్పారు. విద్యుత్ నిలిపివేయడంతో కార్యాలయంలో జరగాల్సిన భూముల రిజిస్ట్రేషన్‌ల తో పాటు శాఖా పరమైన పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పనుల నిమిత్తం కార్యాలయానికి చేరుకున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ప్రజల పనుల కోసం పనిచేసే రెవెన్యూ కార్యాలయంలో ఈ పరిస్థితులు నెలకొనడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అప్పుల కుప్పగా మారినా తెలంగాణలో ప్రభుత్వ కార్యాలయాలు బాకీలు చెల్లించలేని ధీనావస్థలో ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టి సారించి ప్రభుత్వ కార్యాలయాల్లో ఇటువంటి సమస్యలు పునారవృతం కాకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## సిరిపురం వారాంతపు సంతలో ఇరువర్గాల ఘర్షణ

**హత్నూర, డిసెంబరు 27, ప్రభాతవార్త:** మండలంలోని సిరిపురం గ్రామంలో ప్రతి బుధవారం నిర్వహించే వారాంతరపు సంతో బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సంతలో జరిగిన చిన్న సమస్య చిలికి చిలికి గాలివాన అన్నట్లుగా ఇరు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో గొడవలు చోటు చేసుకున్నాయి. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలు అయినట్లు స్థానికులు పేర్కొన్నారు. విషయం తెసుకున్న హత్నూర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఏదేమైనా గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

## బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి



బిఎస్ఎన్ఎల్ బోర్డు సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్ శంకర్‌నాయక్

**జహీరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బిఎస్ఎన్ఎల్ బోర్డు డైరెక్టర్ శంకర్ నాయర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన బిఎస్ఎన్ఎల్ బోర్డు సమావేశం శంకర్ నాయక్ పాల్గొని నియోజకవర్గ బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సభలో ప్రస్తావించామన్నారు. నియోజకవర్గంలో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ టవర్లు పెంచాలని, వినియోగదారులకు ఉత్తమ సేవలు అందేలా చూడాలని సూచించినట్లు పేర్కొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలి

**మర్కుక్, డిసెంబర్ 27 (ప్రభాతవార్త):** గ్రామీణ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని మర్కుక్ మండల కో-ఆప్షన్ సభ్యులు సాహెర నరేష్ అన్నారు. మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో మండల స్పోర్ట్స్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం సాహెర నరేష్ సందర్శించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెరుగుతుందని, మండల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లు కూడా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేస్తున్న దృశ్యం

## మంత్రి ఆదేశాలతో రోడ్డు మరమ్మతులు



రోడ్డు మరమ్మత్తులు చేపిస్తున్న సర్పంచ్ సంజీవరెడ్డి

**అక్కన్నపేట, డిసెంబరు27,ప్రభాతవార్త**

అక్కన్నపేట మండలం నుండి హుస్నాబాద్ మీదుగా జనగామ వెల్లే దారిలో అక్కన్నపేట ఎల్లమ్మ గుడి సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కొట్టుకు పోవడంతో వాహన దారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాన్ని అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి ద్వార తెలుసుకున్న రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తు చేపట్టాలని సర్పంచ్‌ను ఆదేవించడంతో సర్పంచ్ సంజీవరెడ్డి బుధవారం రోజున కొట్టుకుపోయిన రోడ్డుపై ట్రాక్టర్‌ల సహాయంతో మట్టి కొట్టించి మరమ్మత్తు చేపట్టారు.

# సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించండి

## -రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అంబేద్కర్ సంఘం వినతి...

**హుస్నాబాద్,(కోహెడ)27,ప్రభాతవార్త**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం సముద్రాల గ్రామానికి గడిచిన 60ఏండ్ల నుండి ఒక్కసారి కూడా సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సి రిజర్వేషన్ రాలేదని,వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో కచ్చితంగా ఎస్సిలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ బుధవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎస్సి కుటుంబాలు దాదాపు 80 ఉండగా అందులో 300ల పైచిలుకు ఓటర్లు ఉన్నారన్నారు.సముద్రాల గ్రామ పంచాయతీ ఏర్పడిన నుండి ఇప్పటి వరకు జరిగిన ఏ ఎన్నికల రిజర్వేషన్‌లు చూసినా బిసి మహిళా,బిసి జనరల్, జనరల్‌కు రిజర్వేషన్ వచ్చిందని ఈ సారి సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సిలకు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.వినతి పత్రం అందించిన వారిలో వేల్పుల (చింతకింది) సింగరయ్య,చింతకింది శంకర్,వేల్పుల సంపత్,కొండని సురేష్,కొండని సతీష్, కనగండ్ల శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల కమిషన్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం



కందిలో ప్రజాపాలనపై అవగాహన కల్పిస్తున్న సంధ్యారాణి

## ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

**-అవగాహన సభలో ప్రత్యేక అధికారి సంధ్యారాణి**

**కంది, డిసెంబరు 27, ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో నిర్వహించే ప్రజాపాలనసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సంధ్యారాణి కోరారు. బుధవారం కందిలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులకు నిర్వహించిన అవగాహనసభలో ఆమె మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం అమలుచేసే 5 గ్యారంటీలకు సంబంధించి ప్రయోజనాలు అందుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ధరఖాస్తులు అందించి రశీదులు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ విశ్వప్రసాద్, ఎంపిఓ మహేందర్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు వరుణ్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఝరాసంగం మండలంలో ప్రజా పాలన సభలు

**ఝరాసంగం, డిసెంబరు 27, ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజా పాలన సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ కె.సుజాత, తహసీల్దార్ సంజీవ్‌రావు తెలిపారు. 28న ఉదయం ఝరాసంగం, కక్కరవాడ, మధ్యాహ్నం కుప్పానగర్, సిద్దాపూర్, 29న ఉదయం మాచ్నూర్, వనంపల్లి, మధ్యాహ్నం బర్దీపూర్, బోజ్యానాయక్‌తండా, 30న ఉదయం కొల్లూర్,చీలపల్లి, మధ్యాహ్నం గంగాపూర్, చీలపల్లితండా, జనవరి 2న ఉదయం క్రిష్ణాపూర్, నర్సాపూర్, మధ్యాహ్నం బిడెకన్నె, కమాల్‌పల్లి, 3న ఉదయం తుమ్మన్‌పల్లి, గుంతమర్పల్లి, మధ్యాహ్నం కప్పాడ్, జునేగావ్, 4న ఉదయం మేదపల్లి, జీర్లపల్లి, మధ్యాహ్నం ఈదులపలి, ఏడాకులపల్లి, 5న ఉదయం దేవరంపల్లి, చిలెమామిడి, మధ్యాహ్నం గినియార్‌పల్లి, చిల్కేపల్లి, 6న ఉదయం ఎల్గోయి, బోరేగావ్, మధ్యాహ్నం పొట్‌పల్లి, బోపన్‌పల్లి, ప్యారవరం గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించనున్నామన్నారు. ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ, తహసీల్దార్‌లు సూచించారు.

## గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

**డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్**



మాట్లాడుతున్న డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

**నిజాంపేట, డిసెంబర్ 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నేటి నుండి నిర్వహిస్తున్న గ్రామ సభలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో గ్రామసభలను నిర్వహించడాన్ని దళిత బహుజన ఫ్రంట్ ఆహ్వానిస్తుందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు అభయహస్తం, ఆరుగ్యారెంటీలకు దరఖాస్తు తీసుకోవడం శుభపరిణామం అని అన్నారు. గ్రామసభలను హడావిడిగా కాకుండా ప్రణాళికబద్ధంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, నిజాంపేట మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కొమ్మాట బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ఏర్పాట్లను పరిశీలించిన ఆర్‌డిఓ



చిరాగ్‌పల్లిలో ప్రజాపాలన సభ ఏర్పాట్లనుపరిశీలిస్తున్న ఆర్‌డిఓ వెంకారెడ్డి

**జహీరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు కొనసాగే ప్రజాపాలన గ్రామసభల ఏర్పాట్లను బుధవారం ఆర్‌డిఓ వెంకారెడ్డి పరిశీలించారు. మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందచేశారు. గ్రామాల్లోని ప్రజలు ధరఖాస్తులు చేసుకోవాలని, అధికారులనుంచి రశీదులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ రవీందర్, సర్పంచ్ నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనకు పూర్తయిన ఏర్పాట్లు

**-మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు**



అధికారులతో ప్రజాపాలనపై సమావేశమైన మున్సిపల్ కమిషనర్

**జహీరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీ నుంచి పట్టణంలో ఆరంభం కానున్న ప్రజా పాలన కార్యక్రమం నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ సమావేశం మందిరంలో మున్సిపల్ అధికారులకు ప్రజాపాలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజా పాలన సభను నిర్వహిస్తామన్నారు. వార్డుల్లో నిర్వహించే సభలకు అధికారులను కేటాయించినట్లు, సభలో ప్రజలు తమ ధరఖాస్తులను అందించి రశీదులు పొందాలన్నారు. మొదటి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఈ దీప్తి చంద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ హెచ్చుతగ్గులతో పరికరాలు దగ్ధం

**పాపన్నపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:** విద్యుత్ హెచ్చుతగ్గులతో విలువైన పరికరాలు కాలిపోతున్నాయని అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పాపన్నపేటలోని ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం పలు విలువైనపరికాలు విద్యుత్ హెచ్చుతగ్గులతో కాలిపోయాయి. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు సూచించినా పట్టించుకోకపోవడంతో ఎంఆర్‌సి,మండలపరిషత్,ఉపాధిహామీ కార్యాలయాల్లోని కంప్యూటర్లు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు కాలిపోయినట్లు చెప్పారు. విలువైన పరికరాలు కాలిపోవడంతో ఆస్థి నష్టం పెద్ద మొత్తంలో చోటుచేసుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రభాతవార్త విద్యుత్ ఏఈని పలు మార్లు ఫోన్లు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

# ప్రజా పాలనపై మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, వివిధ శాఖల అధికారులు

**నర్సాపూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంపై బుధవారం నర్సాపూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కమిషనర్ ఆర్.వెంకట్‌గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహించే ప్రజాపరిపాలనసభలపై చర్చించడం జరిగిందన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో నిజమైన లబ్ధిదారులను గుర్తింపుకోసం దరఖాస్తుల పంపిణీ, దరఖాస్తులు నింపే విధానంతోపాటు ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు కోసం చర్చించడం జరిగిందని చెప్పారు. అయితే ప్రజా పరిపాలన కార్యక్రమంలో బాగంగా మొదటిరోజు గురువారం ఉదయం 8 గంటలకు రోషిణి స్కూల్ జగన్నాథరావు కాలనీ వద్ద, మధ్యాహ్నం రెండు గంటలకు రెండవ వార్డు ఎన్జీవోస్ కాలనీలోని కమ్యూనిటిహాల్ వద్ద ప్రజా పాలన వార్డు సభలు నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులు తీసుకోవడం జరుగడుతుందని కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడిఈ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ ఎండి ఫైజల్, ఈఓ సామ్యా నాయక్, ఏఈఓ చంద్రవేణిసింగ్, సబ్ ఇంజనీర్ అశోక్, సీనియర్ అసిస్టెంట్ మృణాళిని, ఎంఎన్ఓ తారాసింగ్, మహేశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్ మేనేజర్, కార్యాలయ సిబ్బంది, ఎంఈపిఎంఏ సిబ్బంది, అధికారులు, అంగన్‌వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మండల పూజ

**హాజరైన మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

**మెదక్ అర్బన్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** వేద పండితుల మంత్రోచ్ఛరణలు.. అయ్యప్ప స్వాముల శరణు ఘోష.. భక్తుల జయజయ ధ్వానాల మధ్య అయ్యప్పస్వామి మండల పూజ బుధవారం మెదక్‌లో ఘనంగా జరిగింది. మెదక్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ఉదయం సుప్రభాత సేవ, శ్రీగణేష్, శ్రీసుబ్రమణ్యస్వామి పూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, పదునెట్టంబడి పూజ వైభవంగా జరిగింది. గురుస్వాములు హరిదాస్, వైద్య రాజులు వేద మంత్రాలు పఠించారు. ఈ సందర్భంగా గుండు రమేష్ స్వామి సన్నిధానం స్వాములు వేలంపాటలో రూ.56,000 లకు పడి వెలిగించడం దక్కించుకున్నారు. అనంతరం వారు పడి వెలిగించారు. మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారి, గురుస్వామి వైద్య రాజు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. పడిపూజలో భజన బృందం పాడిన పాటలు అలరించాయి. అనంతరం గీతా విద్యాసంస్థల చైర్మన్ రామాంజనేయులు అన్నదానం నిర్వహించారు. పూజలో పూజారి అశోక్, గురుస్వాములు గంగ లక్ష్మీపతి, శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్, కొండ శ్రీను, పురం వెంకట్ నారాయణ, వీర్‌కుమార్, పార్థీవనాథ్, శ్రీధర్, సత్యం, రాధాకృష్ణ, సత్యనారాయణ, ఆలయ బాధ్యులు చక్రపాణి, ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** పట్టణంలో దుర్గప్పగారి అశోక్ గౌడ్‌గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఆభరణాల ఊరేగింపు నర్సాపూర్ పట్టణంలోని శివాలయం నుండి ప్రారంభమై ప్రధానవీధులగుండా అయ్యప్పదీక్షా స్వాముల భజనలతో ఆట పాటలతో సాగి హైదరాబాద్ ప్రధాన రోడ్డులోగల పందివాగు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఅయ్యప్పస్వామి దేవాలయం వరకు సాగింది. ఆలయంలో అయ్యప్పస్వామి విగ్రహాలను ప్రతిష్టించి ఆభరణాలను అలంకరించి ఆయ్యప్పస్వామి మహాపడిపూజా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహాపడిపూజకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయంలో మహాపడిపూజ జరిపించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పదీక్షాస్వాములు. నాయకులు నహిమొద్దీన్, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శశిధర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

**పాపన్నపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:** మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి మామ రాజిరెడ్డి ద్వాదశ దినకర్మను బుధవారం మండలంలోని యూసుప్‌పేటలో నిర్వహించగా మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పాల్గొని రాజిరెడ్డికి ఘన నివాళులర్పించారు. రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి జడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, నాయకులు గాలి అనిల్ కుమార్, తిరుపతిరెడ్డి, బాలక్రిష్ణ, చంద్రాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజా పరిపాలన'ను విజయవంతం చేయాలి

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్**

**నర్సాపూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పరిపాలన కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయతంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఎంపిపి జ్యోతిసురేశ్‌నాయక్ కోరారు. బుధవారం ఎంపిపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ, ప్రజా పరిపాలనలో భాగంగా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత, అభయ హస్తం వంటి పథకాలను ప్రజలకు అందించేందుకు నేటి నుండి జనవరి 6 వరకు ఆయా గ్రామాలకు అధికారులు వచ్చి గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం యాంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖచ్చితంగా నెరవేరుస్తారన్నారు.ప్రజా పరిపాలన కార్యక్రమం విజయవంతం చేసెందుకు ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు సహకరించాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పరిపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వారు వెల్లడించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్త,కాగజ్ మద్దూర్ సర్పంచ్ శివకుమార్, నాయకులు ఉదయ్‌కుమార్,రశీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్, ఎంపిపి జ్యోతి తదితరులు



తపస్ డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

## ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** పట్టణంలోని జిల్లా విద్యాధికారి కార్యాలయంలో బుధవారం తపస్ క్యాలెండర్, డైరీని జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దేశభక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించాలని, జాతీయ నాయకుల జీవితచరిత్రలు చదివించాలని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాంటెస్ట్ అభ్యర్థి మామిడి సుధాకర్‌రెడ్డి, ఏడీ విజయలక్ష్మీ, ఏఎస్‌వో నవీన్‌కుమార్, ఎస్‌వో జ్యోతి, తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, నాయకులు అర్వి రామారావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోరు బావి పనులు ప్రారంభం



బోరుబావి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 27,ప్రభాతవార్త:** మండల పరిధి రామాయపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం బోరుబావి పనులను ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి ప్రారంభించారు. కొన్నిరోజులుగా పాఠశాలలో నీటి సమస్య ఉందని ఉపాధ్యాయులు, గ్రామస్తులు తెలపడంతో మండల పరిషత్ నిధులతో బోరు బావిని తవ్విస్తున్నట్లు ఆమె తెలిపారు. సర్పంచి పోచయ్య, వైస్ ఎంపీపీ సత్యానారాయణగౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శివకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు సునీత ఉన్నారు.

**నాణ్యమైన భోజనాన్ని అందించాలి...**

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 27,ప్రభాతవార్త:** పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి రామాయపల్లిలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితిసి శిక్షణను అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. ఆమె వెంట నాయకులు గోపాల్‌రెడ్డి, సత్యం గౌడ్,శివకుమార్, మోహన్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

**దళితులపై దాడిచేసినవారిపై**

## ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**పోలీస్‌స్టేషన్‌లో దళిత సంఘాల ఫిర్యాదు**

**నర్సాపూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** దళితులపై అకారణంగా దాడి చేసి గాయపరిచిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శివకుమార్‌కు దళిత సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు సంజీవ్, కదారి నాగరాజు, బిక్షపతి, నరేశ్, రాంచందర్ మాట్లాడుతూ నర్సాపూర్ మండలంలోని అచ్చంపేట గ్రామంలో నాలుగు రోజులుగా పోచమ్మ జాతర జరుగుతుందన్నారు. అయితే మంగళవారం రాత్రి దళితులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డిజే సౌండ్‌తో ఆడుతుండగా కొంత మంది అకారణంగా దళితులపై అసభ్యకరంగా దుర్భాషలాడుతూ దాడి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని వారు కోరారు.గ్రామాన్ని డిఎస్పీ వెంటనే సందర్శించి విచారణ జరుపాలని వారు కోరారు. లేని పక్షంలోదళిత సంఘాల అద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలోరమేష్, ఆంజనేయులు, ప్రభాకర్,శ్రీకాంత్, నర్సింలు, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

# కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**జూనియర్ సివిల్‌జడ్జి, లీగల్ సర్వీస్ మండల్ కమిటీ చైర్మన్ అనిత**

**నర్సాపూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత పేర్కొన్నారు. బుధవారం మెదక్‌జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నర్సాపూర్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి జూనియర్ సివిల్‌జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత పాల్గొని న్యాయవాదులు, పోలీస్ అధికారులు బ్యాంక్ అధికారులతో మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వార రాజీచేయదగ్గ కేసుల్లో ఇరువురు కక్షిదారులు రాజీ కుదుర్చుకొని ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నందున ఈ జాతీయ లోక్ అదాలత్ ద్వార రాజీ చేయదగ్గ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలియజేయడం జరిగింది. రాజీ చేయదగిన కేసులలో పోలీస్ అధికారులు కక్షిదారులకు రాజీ చేసుకోవటానికి సంపూర్ణ సహకారం అందించాలని పోలీస్ అధికారులను ఆదేశించడం జరిగింది.

అదేవిదంగా వివిధ బ్యాంక్ అధికారుల తో మాట్లాడుతూ బ్యాంక్ ద్వార రుణాలు తీసుకొని చెల్లించే ప్రక్రియలో భాగంగా రాజీ చేయదగ్గ కేసులను పరిష్కరించడానికి సంపూర్ణ సహకారాన్ని అందించాలన్నారు. అంతేగాక పెండింగ్‌లో ఉన్న మోటార్ వెహికిల్స్ ఈ-చాలాన్‌లు ఆన్‌లైన్ ద్వార చెల్లించుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏజిపి సత్యనారాయణ, లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, బెంచ్ మెంబర్ లోక్ అదాలత్ మధుశ్రీ, ఎస్ఐ శివకుమార్, కౌడిపల్లి ఎస్ఐ శివ ప్రసాద్‌రెడ్డి, శివ్వంపేట ఎస్ఐ రవికాంత్‌రావు, చిలిపిచెడ్ ఎస్ఐ మైబూబ్‌అలీ, ఎక్సైజ్ ఎస్ఐ కాజా అజీజ్‌హైమద్, ఎస్‌బిఐ మేనేజర్ సునీల్, ఎస్‌బిహెచ్ మేనేజర్ నర్సయ్య, ఎంజివిబి మేనే జర్, శివ్వంపేట ఇండియన్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మి, న్యాయవాదులు కె.ప్రకాష్, వి.ప్రభు,ఎ. ఆనంద్ కుమార్, కె.నాగరాజు, కోర్టు సూపరింటెండెంట్ జంగా శ్రీనివాస్,టైపిస్ట్ అసిస్టెంట్ ఆంజనేయులు, కోర్టు కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.



దత్తాత్రేయుడి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## దత్తాత్రేయుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, డిసెంబరు 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని దత్తాత్రి ఆలయాన్ని బుధవారం నారాయణఖేడ్ శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి దర్శించుకున్నారు. దత్త జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేను ఆలయ కమిటీ బాధ్యులు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, సర్పంచ్‌లు, అనితగుండేరావు, ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు రూప్‌సింగ్, నాయకులు పండరినాథ్, వెంకట్‌సాగర్, నరసింహారెడ్డి, సజీవ్‌పాటిల్ తదితరులు ఉన్నారు.

## ముగిసిన మల్లన్న జాతర మహోత్సవాలు



మల్గిలో మల్లన్న దేవుడికి పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

**న్యాల్‌కల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:** మండలంలోని మల్గి గ్రామంలో ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహిస్తున్న మల్లన్న జాతర మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిసాయి. అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు పిల్లాపాపలతో గ్రామానికి చేరుకోవడంతో సందడి నెలకొంది. ఉత్సవాల ముగింపులో భాగంగా బుధవారం ఉదయం 5 గంటలకు మల్గిలోని మల్లన్న గట్టు నుంచి గ్రామంలోని పురవీధుల గుండా మల్లన్న పల్లకి సేవ ఊరేగింపు భక్తిశ్రద్దలతో నిర్వహించారు. 9 రోజుల పాటు ఉత్సవాలకు చేరుకున్న భక్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా సర్పంచ్ మరుతియాదవ్, ఎంపిటిసి సభ్యులు శివానంద శ్రీపతి, వార్డుసభ్యులు విఠల్ సిద్దారెడ్డి, ఆలయ కమిటీ బాధ్యులు సంజురెడ్డి, వైద్యనాథ్, జైపాల్‌రెడ్డి, బడక రాజు, విఠల్, మహేష్, నాగేష్, కార్తీక్, రాకేష్, సాయినాథ్, ఉమేష్‌గౌడ్, గణేష్, గ్రామస్థులు సహకారం అందచేశారు.

**సిర్గాపూర్‌లో...**

**సిర్గాపూర్, డిసెంబర్ 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న మల్లన్న జాతర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు మల్లన్న స్వామికి ప్రత్యేక అభిషేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక యాదవుల సంఘం ఆధ్వర్యంలో ఒగ్గు కళాకారులచే వినోద కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూరులో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**చౌటకూరు, డిసెంబరు 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం టిటిడి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు, యవకులు పాల్గొని భక్తిశ్రద్దలతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులకు ప్రసాదవితరణ(అన్నదానం) చేశారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించడం ఆనందంగా ఉందని గ్రామస్తులు అన్నారు. కార్యక్రమంలో అన్నపూర్ణ భజన మండలి భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కనుల పండువగా పౌర్ణమి దీపోత్సవం



దీపోత్సవాన్ని వెలిగిస్తున్న పీఠాధిపతి అప్పగారు

**ఝరాసంగం, డిసెంబరు 27, ప్రభాతవార్త:** దత్తాత్రేయ జయంతిని ఉత్సవాలను పురస్కరించుకుని బర్దీపూర్‌గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో మంగళవారం రాత్రికి నిర్వహించిన లక్ష దీపోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పల ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని దీప ప్రజ్వలనచేసి ప్రారంభించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య, హరహర శంభోశంకర నామస్మరణతో దీపోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా కొనసాగింది. ఝరాసంగం, కోహీర్ మండలాలకు చెందిన 72 గ్రామాలకు అయోధ్యలో పూజించిన అక్షింతలను పంపిణి కార్యక్రమం రామనామ స్మరణతో నిర్వహించారు.

**ఆకట్టుకున్న పల్లకి సేవ...**

బుధవారం ఉదయం శ్రీదత్తాత్రేయ స్వామి పల్లకి సేవ కార్యక్రమం భక్తిశ్రద్దలతో కొనసాగింది. గ్రామంలోని పురవీధుల గుండా పల్లకి సవేను మహిళలు మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మాచ్నూర్ వెంకటేశం, కేతకి ఆలయ మాజీ చైర్మన్ నీల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

**పాపన్నపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీకోడ్-లింగాయపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో విద్యను అందుకుంటున్న 100 మంది విద్యార్థులకు బుధవారం మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను పంపిణి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, ట్రస్టు నిర్వాహకులు సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

## మత ప్రచారం చేసిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

**-అడిషనల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విహెచ్‌పి**

**పుల్కల్, డిసెంబరు 27,ప్రభాతవార్త:** మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో మత ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ బాధ్యులు బుధవారం తెలంగాణ మాడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా విహెచ్‌పి ధర్మ ప్రసార్ సహ ప్రముఖ్ సుభాష్ చందర్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన ప్రిన్సిపాల్ జ్యోతిహేప్సిబ సంగారెడ్డి నుంచి క్రైస్తవ మిషనరీలకు చెందినవారితో పాఠశాలలో మతబోధనలు చేయించారని మండిపడ్డారు. చట్ట విరుద్ధంగా హిందూ మత విశ్వాసాలను అవమానించేలా విద్యార్థులకు బోధన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో మత ప్రచారం చేసిన ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ మాడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విహెచ్‌పి బాధ్యులు